కొనసాగుతున్న నామినేషన్ల పర్వం..

www.aksharadarbar.com

శనివారం 20, ఏప్రిల్ 2024

అక్షర దర్బార్

voice of the people

సంచిక : 68 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

ఆ ఠాణాలో స్టాఫ్ కొరత

- ముగ్గురు ఎస్సైలకు ఒక్కరే..
- 53మంది సిబ్బందికి 18 మందే మాత్రమే
- పని భారంతో సతమతమవుతున్న పోలీసులు

2

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకు మృతి

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

3 లో

- ఇప్పటికే పేలుతున్న నేతల మాటల తూటాలు
- మానుకోట సీఎం రేవంత్ సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- 25న వరంగల్ కు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 22నుంచి కేసీఆర్ బస్సు యాత్ర
- అదేరోజు మానుకోటకు కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు
- 23న భువనగిరికి కేంద్రమంత్రి జయశంకర్
- 24న మడికొండ వద్ద సీఎం రేవంత్ రెడ్డి సభ
- ఉధృతం అవుతున్న ఎన్నికల ప్రచారం

2 లో

నామినేషన్ల దాఖలు తుది గడువు సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారానికి పదును పెడుతున్నాయి. తమ పార్టీ కార్యకర్తలతో మండల, శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాల నిర్వహణ పూర్తిచేసుకుని ప్రచార బాట పడుతున్నాయి. గెలుపు కోసం ప్రజలను కలిసే పనిలో ఉన్నాయి. తాజాగా ఆయా రాజకీయ పార్టీ అగ్ర నేతలు కూడా ప్రచార పర్వంలో అడుగు పెడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి నేతలు రంగంలోకి దిగారు. తమ ఉపన్యాసాలతో మాటల తూటాలు పేల్చుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో జాతీయస్థాయి నేతలు రాష్ట్రానికి రాబోతున్నారు. దీంతో ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది.

- అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

ప్రచార హోరు..

రంగంలోకి దిగుతున్న పార్టీల అగ్రనేతలు

పేదలకు అండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం..

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం ఫైర్
- మెదక్ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

4

పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెదక్ అభివృద్ధిని కేసీఆర్ విస్మరించారని, కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదని సీఎం ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు పథకాలు చూసి కేసీఆర్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు.

అకాల వర్షం.. అపార నష్టం..

- వర్షానికి నేల రాలిన మామిడి, నిమ్మకాయ
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు

4

ప్రచార హోరు..

రంగంలోకి దిగుతున్న పార్టీల అగ్రనేతలు



- ఇప్పటికే పేలుతున్న నేతల మాటల తూటాలు
- మానుకోట సీఎం రేవంత్ సభతో కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్
- 25న వరంగల్ కు రానున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- 22నుంచి కేసీఆర్ బస్సు యాత్ర
- అదేరోజు మానుకోటకు కేంద్ర మంత్రి కిరణ్ రిజు
- 23న భువనగిరికి కేంద్రమంత్రి జయశంకర్
- 24న మడికొండ వద్ద సీఎం రేవంత్ రెడ్డి సభ
- ఉధృతం అవుతున్న ఎన్నికల ప్రచారం

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

నామినేషన్ల దాఖలు తుది గడువు సమీపిస్తుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రచారానికి పదును పెడుతున్నాయి. తమ పార్టీ కార్యకర్తలతో మండల, శాసనసభ, పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశాల నిర్వహణ పూర్తిచేసుకుని ప్రచార బాట పడుతున్నాయి. గెలుపు కోసం ప్రజలను కలిసే పనిలో ఉన్నాయి. తాజాగా ఆయా రాజకీయ పార్టీ అగ్ర నేతలు కూడా ప్రచార పర్వంలో అడుగు పెడుతున్నారు. ఇప్పటికే రాష్ట్రస్థాయి నేతలు రంగంలోకి దిగారు. తమ ఉపన్యాసాలతో మాటల తూటాలు పేల్చుతున్నారు. ఒకటి రెండు రోజుల్లో జాతీయస్థాయి నేతలు రాష్ట్రానికి రాబోతున్నారు. దీంతో ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది. ఈనెల 18న పార్లమెంటు సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన విషయం తెలిసిందే. అదే రోజు నుంచి నామినేషన్ల దాఖలు పర్వం మొదలైంది. నామినేషన్లను దాఖలు చేయడానికి 25వ తేదీ వరకు గడువు ఉంది. ఈనెల 26వ తేదీన నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు 29. గురు, శుక్ర, శనివారం ఆయా పార్లమెంటు నియోజకవర్గం నుంచి కొందరు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా ఉన్నారు. సోమవారం నుంచి నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. సోమ, గురువారం మంచి ముహూర్తం అని ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ రెండు రోజుల్లో తమ నామినేషన్లను దాఖలు చేయడానికి ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థులు పలువురు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విషయానికి వస్తే ఇప్పటికే మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ శుక్రవారం నామినేషన్ వేశారు. అనంతరం మహబూబాబాద్ లో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన జన జాతర బహిరంగ సభకు టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. బీజేపీ, బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో నిరుచుకపడిన ఆయన కాంగ్రెస్ పార్టీకి మానుకోట కంచు కోట అన్నారు. మానుకోట నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ ను గెలిపించాలని రేవంత్ రెడ్డి ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి శనివారం నుంచి ప్రచార శంఖారావాన్ని పూరించారు. ఉదయం మహబూబ్ నగర్ లో జరిగిన కాంగ్రెస్ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి ఆ తర్వాత సాయంత్రం మానుకోట జన జాతర సభకు చేరుకున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ విధానాలపై విరుచుకుపడిన ఆయన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

రంగంలోకి అగ్ర నేతలు

ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు తెలంగాణకు రానున్నారు. ఈనెల 22న కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు మహబూబాబాద్ రానున్నారు. బీజేపీ అభ్యర్థి అజ్మీరా సీతారాంనాయక్ 22న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిరణ్ రిజు పాల్గొంటారు. 23న కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జయశంకర్ భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం రానున్నారు. 24న రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వరంగల్ లో బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొంటారని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. అరూరి నామినేషన్ వేయటానికి ముందు హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపాయి. 25న బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వరంగల్ పర్యటన కూడా ఖరారైంది. తమ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ను గెలిపించాలని ప్రజలను కోరేందుకు ఆయన వరంగల్ వస్తున్నారు. ఆరోజు భారీ బహిరంగ సభలో అమిత్ షా ప్రసంగిస్తారు. అయితే ఈ సభ ఎక్కడ నిర్వహించాలనేది ఇంకా ఖరారు కాలేదని తెలిసింది. ఈనెల 24న వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య నామినేషన్ దాఖలు చేస్తారు. ఆరోజు మడికొండ వద్ద కాంగ్రెస్ పార్టీ నిర్వహించే జన జాతర సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. ఇప్పటికే మడికొండ వద్ద సభ నిర్వహణ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ చేపట్టింది. 23న మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత, వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుధీర్ కుమార్ ఈనెల 22న నామినేషన్లను దాఖలు చేయనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల నామినేషన్ల కార్యక్రమాల్లో ఆ పార్టీ అగ్ర నేతలు పాల్గొనే అవకాశం ఉంది. అగ్రనేతల పర్యటనలు, సభలతో ప్రచారం ఉధృతం కానుంది.

ఆ ఠాణాలో సిబ్బంది కొరత

- ముగ్గురు ఎస్సైలకు ఒక్కరే..
- 53మంది సిబ్బందికి 18 మందే మాత్రమే
- పని భారంతో సతమతమవుతున్న పోలీసులు

అక్షర దర్బార్, నర్సంపేటః అతి ముఖ్యమైన పోలీస్ శాఖకు నర్సంపేట లో బాద్యులు లేకపోవడం ఇబ్బందులను తెచ్చిపెడుతున్నది. ముగ్గురు పనిచేయాల్సిన చోట ఒక్కరే ఉండటంతో పనిచేసే వారిపై పని ఒత్తిడి తీవ్రంగా ఉంటున్నది. వరంగల్ కమిషనరేట్ పరిధిలో నర్సంపేట ప్రధాన కేంద్రం. ధర్నాలు, ఆందోళనలు జరగడం వంటి సంఘటనలు ఇక్కడ ఎక్కువగా ఉంటాయి. వివిధ సమస్య పరిష్కారం కోసం ప్రజల నుంచి పెద్ద ఎత్తున వినతులు వస్తుంటాయి. ఎన్నికల విధులకు,ఎస్కార్ట్ డ్యూటీ, సంఘటనలు జరిగినప్పుడు తగిన చర్యలు తీసుకోవడం.. ఇలా ప్రతి పనిని బాధ్యతాయుతంగా చేయాల్సి ఉంటుంది. ఈ విధులన్ని ఒక్కరే నిర్వహించాల్సి పరిస్థితి ఉంది. నర్సంపేట పట్టణంలో 24 వార్డులు, మండలంలో 26 గ్రామాలతో విస్తరించింది. ఇదివరకు ముగ్గురు ఎస్సైలు, ఒక సీఐ విధులు నిర్వహించేవారు. కొన్ని నెలల క్రితం జరిగిన బదిలీల్లో నర్సంపేట పోలీస్ స్టేషన్ లో పనిచేసిన ముగ్గురు ఎస్సై లు, సీఐ ట్రాన్స్ ఫర్ అయ్యారు. అనంతరం ఇక్కడకు ఒక సీఐ, ఒక ఎస్సైని మాత్రమే పంపించారు. ఎస్సైలు నర్సంపేటలో పనిచేయడానికి అంతగా ఆసక్తి చూపడంలేదు. పోలీస్ స్టేషన్లో సిబ్బంది లేమి సాదారణ ప్రజలకు ఇబ్బందిగా మారింది. 53మంది సిబ్బంది పనిచేయాల్సిన చోట 18 మంది మాత్రమే పనిచేస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు దృష్టిసారించి వెంటనే తగినంత సిబ్బందిని నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ విష ప్రచారాలు నమ్మొద్దు

- బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం
- ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

అక్షర దర్బార్, రేగొండ: బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని వరంగల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ అన్నారు. శనివారం రేగొండ మండలంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా అధికారంలోకి మాత్రం బీజేపీ రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. వరంగల్ ఎంపీగా తనను గెలిపిస్తే పార్లమెంట్ పరిధిలో ఉన్న ప్రతి సమస్యను తీర్చి వరంగల్ ను అభివృద్ధి చేస్తానన్నారు. దీనికోసం ప్రతి కార్యకర్త కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి చేసిన అభివృద్ధి పనులను వివరించాలని కోరారు. మామునూరు ఎయిర్ పోర్ట్ పనులు పూర్తిచేసి, భూపాలపల్లికి రైల్వే లైన్ తీసుకొస్తానని హామీ ఇచ్చారు. హనుమకొండ లో ఐటీ హబ్ ని విస్తరించి అనేక ఐటీ కంపెనీలు రావడానికి కృషి చేస్తానని తెలిపారు. కొడకండ్ల మండలంలో మినీ టెక్స్ టైల్ పార్క్ ఏర్పాటు పనులు పూర్తి చేయించి పెట్టుబడులతో కంపెనీలు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటల నమ్మి ప్రజలు మోసపోవద్దని అన్నారు. రేవంత్ రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయే కానీ చేతలు తంగేళ్లు దాటడం లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నిశీధర్ రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ధర్మారావు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు విజయ రామారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి, కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ప్రదీప్ రావు, వరంగల్ హనుమకొండ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, పార్లమెంట్ కన్వీనర్ కుమారస్వామి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీగా మాలోత్ కవితను గెలిపించాలి

- నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి
- గిర్నిబావిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం
- పాల్గొన్న ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత

అక్షర దర్బార్, దుగ్గొండి : మహబూబాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవితను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం గిర్నిబావిలో బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా ఎంపీ అభ్యర్థి మాలోత్ కవితతో పాటు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గంలో నన్ను వ్యక్తిగతంగా దెబ్బకొట్టడానికే రేవూరి, దొంతి ఒక్కటయ్యారని ఆరోపించారు. ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించాలని, భారీ మెజారిటీతో గెలిపించాలని ఆమె కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

బైక్ ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

తండ్రి కొడుకుల దుర్మరణం

అక్షర దర్బార్, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఖమ్మం–వరంగల్ ప్రధాన రహదారిపై బొడ్లాడ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు–బైక్ ఢీకొన్నాయి. బైక్ ను ఢీకొట్టిన బస్సు కొంతదూరం లాక్కెళ్లింది. ఈ ప్రమాదంలో చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కుల హరీష్ (35), అతడి కుమారుడు తేజ (5) అక్కడికక్కడే మృతి చెందారు.

గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

అక్షర దర్బార్, నర్సంపేట : కాంగ్రెస్ గ్యారెంటీలను కార్యకర్తలు ప్రతి గడపగడపకూ తీసుకెళ్లాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సూచించారు. శనివారం నర్సంపేట పార్టీ కార్యాలయంలో ఆయన కాంగ్రెస్ గ్యారెంటీల మొబైల్ యాప్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్యారెంటీలను యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కలపెల్లి రవీందర్ రావు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్,

మొబైల్ యాప్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ మోడెం ఎల్లగౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ అశ్విని

అభివృద్ధిలో వేగం పెంచండి

మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. హనుమకొండలోని వడ్డేపల్లి బండ్ పై కొనసాగుతున్న అభివృద్ధి పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాంపౌండ్ పనులతో పాటు సందర్శకులు వీక్షించడానికి వీలుగా (వ్యూ డెక్) పనులు, సైకిల్ ట్రాక్, ల్యాండ్ స్కేపింగ్ పనులను జూన్ వరకు పూర్తి చేయాలని అన్నారు. కరీంనగర్ ప్రధాన రహదారి ఎల్లాపూర్ వద్ద గ్రాండ్ ఎంట్రెన్స్ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఏనుమాముల బాలాజీ జంక్షన్ వద్ద నిర్మిస్తున్న బ్యూటిఫికేషన్ పనులు బాగున్నాయని, హనుమకొండలో కూడా ఇదే తరహాలో ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఎస్ఈకి సూచించారు. నర్సంపే ట రోడ్డులో గ్రాండ్ ఎంట్రన్స్ పనుల ను పరిశీలించిన ఆమె నెలలోగా స్టీల్ ఏర్పాటు పనులు పూర్తి చేయాలన్నారు. క్రిస్టియన్ కాలనీలో కమ్యూనిటీ హాల్ ఏర్పాటు పనులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సిఎంహెచ్వో డా.రాజేష్, హెచ్ వో రమేష్, ఈఈలు రాజయ్య, సంజయ్ కుమార్, డీఈలు సంతోష్ బాబు, రవికుమార్, సారంగం, రంగారావు, కృష్ణమూర్తి, అజ్మీరా శ్రీకాంత్, ఏఈ హరి కుమార్, శానిటరీ ఇన్ స్పెక్టర్లు కరుణాకర్, సంపత్ రెడ్డి, శ్రీను, ఆనంద్ పాల్గొన్నారు.

ఎన్నికల కంట్రోల్ రూం పరిశీలన

ఏర్పాట్లును పరిశీలించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగా

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : కసభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ కలెక్టరేటులో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంను ఎన్నికల వ్యయ పరిశీలకులు ధీరజ్ సింగా శనివారం పరిశీలించారు. స్టాటిక్ సర్వేలెన్స్, వీడియో సర్వేలెన్స్ బృందాల లైవ్ స్ట్రీమింగ్ ను ఆయన పరిశీలించి కంట్రోల్ రూం పనితీరును అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల ఎన్నికల ప్రకటనల వ్యయ వివరాలపై ఆయన ఆరా తీశారు. సోషల్ మీడియాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని ధీరజ్ సింగా సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారులు

రికార్డులను పరిశీలిస్తున్న ధీరజ్ సింగా

రాంరెడ్డి, ఆయూబ్ అలీ, కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్, సోషల్ మీడియా సభ్యులు విష్ణు, రామకృష్ణ, రాజ్ కుమార్, లైజన్ ఆఫీసర్ నయీమ్ తదితరులు పాల్గొన్నారు

నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు జరగాలి

జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా జరగాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం కలెక్టరేట్ మిని కాన్ఫరెన్స్ హాల్లో భూపాలపల్లి మున్సిపాలిటీలో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై మున్సిపల్, సింగరేణి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరగడం లేదని అన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోని అవాసాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన బాధ్యత సంస్థదేనని స్పష్టం చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణ జరగాలని ఆదేశించారు. సింగరేణి, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ రావు

ఓటు హక్కును వినియోగించుకోవాలి

స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ రావు

అక్షర దర్వర్, పరకాల : దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 85 ఏళ్లు దాటిన వయోవృద్ధుల ఇంటి వద్దకే వచ్చి ఓటు వేసే ఏర్పాటు చేయడం జరిగిందని, వికలాంగులు, వయో వృద్ధుల కోసం ఆటోలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి మధురిమ, సీడీపీవో భాగ్యలక్ష్మి, నడికూడ ఎంపీడీవో శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ సంఘం ప్రతినిధులు సమ్మయ్య, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గురుకుల ప్రవేశ పరీక్షలో తొగర్రాయి విద్యార్థుల ప్రతిభ

అక్షర దర్బార్ దుగ్గొండి : గురుకుల్ సెట్ ఫలితాల్లో తొగర్రాయి ప్రాథమిక పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ప్రతిభను చాటి గురుకుల ప్రవేశాలు పొందినట్లు హెచ్ఎం పాలకుర్తి మల్లయ్య శనివారం తెలిపారు .ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు సహస్ర, ప్రమిత, సాత్విక, మనస్విత, వాగ్దేవి, రూపశ్రీ, నిఖిత, సంజన, వరుణ్ లను అభినందించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన మాజీ సర్పంచ్ ఓడేటి తిరుపతి రెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వడ్డేపల్లి పద్మశ్రీ, మాతరసి రమాదేవి, ఈదుల వీరస్వామి, ఓదెల నీరజ, విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మానుకోట జనజాతర సభ విజయవంతం

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి తక్కళ్ల పెల్లి రవీందర్ రావు

అక్షర దర్బార్, నర్సంపేట : మహబూబాబాద్ జనజాతర సభ విజయవంతానికి కృషి చేసిన నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ తక్కలపల్లి రవీందర్ రావు ధన్యవాదాలు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లినట్లు ఆయన వివరించారు.

అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై సీఎం ఫైర్
- మెదక్ ర్యాలీలో రేవంత్ రెడ్డి

ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, మెదక్: పేదలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెదక్ అభివృద్ధిని కేసీఆర్ విస్మరించారని, కేంద్రంలోని బీజేపీ సర్కార్ రాష్ట్రాన్ని పట్టించుకోలేదని సీఎం ధ్వజమెత్తారు. కాంగ్రెస్ సర్కారు పథకాలు చూసి కేసీఆర్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని విమర్శించారు. పిట్టల దొరలా మారి, కేసీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మెదక్ లోకసభ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు నామినేషన్ కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో మెదక్ జిల్లాకు ఒక్క పరిశ్రమైనా వచ్చిందా అని ప్రశ్నించారు. దుబ్బాకకు మోదీ ఇచ్చిన నిధులెన్నో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. వచ్చే వరి పంటకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్‌ను గెలిపించి రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని కోరారు. రాష్ట్రంలో రూ.22,500 కోట్లతో 4.5లక్షల ఇళ్లు నిర్మించేందుకు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకం ప్రారంభించామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి, ఇచ్చే ఇళ్లను రద్దు చేయాలని ఢిల్లీలో ఉండే మోదీ, గజ్వేల్‌లో ఉండే కేసీఆర్ కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. మల్లన్న సాగర్‌లో వేల ఎకరాలు గుంజుకున్నది ఎవరో మనకు తెలియదా? ఆనాడు కలెక్టర్‌గా ఉండి పేదల భూములు గుంజుకున్న వ్యక్తే నేడు బీఆర్ఎస్ అభ్యర్థి అని అన్నారు. కాంగ్రెస్ కష్టాల్లో ఉన్నప్పుడు మెదక్ ప్రజలు ఇందిరా గాంధీని గెలిపించారని గుర్తుచేశారు.

సివిల్స్ టాపర్ అనన్యరెడ్డిని సన్మానిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

సివిల్స్ విజేతను అభినందించిన సీఎం

అక్షర దర్బార్, హైదరాబాద్ : యూపీఎస్సీ పరీక్ష ఫలితాల్లో అఖిల భారత స్థాయిలో మూడో ర్యాంక్ సాధించిన దోనూరి అనన్యరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం అభినందించారు. మొదటి ప్రయత్నంలోనే అద్భుత విజయం సొంతం చేసుకున్న అనన్యరెడ్డితో పాటు ఆమె కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెతో పాటు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన తెలుగు అభ్యర్థులందరికీ ఈ సందర్భంగా సీఎం శుభాకాంక్షలు తెలిపారు. దేశ సేవలో వారంతా మంచి పేరు గడించాలని సీఎం ఆకాంక్షించారు.

మావోయిస్టు కుటుంబానికి పరామర్శ

నివాళులర్పించిన ఎమ్మెల్యే గండ్ర

అక్షర దర్బార్ చిట్యాల : ఇటీవల ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని కాంకెర్ అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్ లో మృతి చెందిన మావోయిస్టు కుటుంబాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు శనివారం పరామర్శించారు. ఎన్ కౌంటర్ లో చిట్యాల మండలం వెల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్, అతడి భార్య రంజిత మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల చిత్రపటాల వద్ద పుష్పాలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. శంకర్ తల్లి రాజపోషమ్మకు ధైర్యం చెప్పారు.

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థులు

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- వరంగల్ నుంచి మరో ముగ్గురు
- మహబూబాబాద్ లో నిల్
- 25 వరకు నామినేషన్ల దాఖలు గడువు

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి: పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల దాఖలు పర్వం కొనసాగుతుంది. మూడో రోజు శనివారం వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. వీరిలో మేకల సుమన్, గాడిపాక అనిల్ కుమార్, మాస సావిత్రి ఉన్నారు. మేకల సుమన్ ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా, అనిల్ కుమార్ స్వతంత్ర అభ్యర్థిగా, సావిత్రి ఎంసీపీఐ(యు) పార్టీ అభ్యర్థిగా తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి ప్రావీణ్యకు అందజేశారు. వీరితోపాటు స్వతంత్ర అభ్యర్థిగా బరిగెల శివ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. శివ గురువారం కూడా స్వతంత్ర అభ్యర్థిగా ఇక్కడ నుంచి నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. గత మూడు రోజుల్లో వరంగల్ లోక్ సభ స్థానం నుంచి నామినేషన్లు వేసిన అభ్యర్థుల సంఖ్య 9 కి చేరింది. ఈ తొమ్మిది మంది అభ్యర్థులు 11 సెట్ల నామినేషన్లను దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాలో మరొకటైన మహబూబాబాద్ పార్లమెంటు స్థానం నుంచి శనివారం నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ నియోజకవర్గం నుంచి గురు, శుక్రవారం మొత్తం ఐదుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. ఈనెల 18న ప్రారంభమైన పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల దాఖలు ఘట్టం 25వ తేదీ వరకు కొనసాగనుంది. దాఖలైన అభ్యర్థుల నామినేషన్లను 26వ తేదీన ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు. ఇప్పటివరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఒక మహబూబాబాద్ స్థానంలోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఈనెల 22, 24 తేదీల్లో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు నియోజక వర్గాల్లో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయడానికి సమాయత్తం అవుతున్నట్లు తెలిసింది.

అకాల వర్షం.. అపార నష్టం

- వర్షానికి నేల రాలిన మామిడి, నిమ్మకాయ
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- ప్రభుత్వం ఆదుకోవాలంటున్న అన్నదాతలు

అక్షర దర్బార్, హైదరాబాద్ : అకాల వర్షంతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయి. పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈదురుగాలులతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. నిజామాబాద్ జిల్లాలో భారీగా పంటనష్టం చోటుచేసుకుంది. పశువులు మృతిచెందాయి. సిద్దిపేట, దుబ్బాకలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి అన్నదాతలకు నష్టం చేకూరింది. హైదరాబాదులో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట పొలంలోనే నీళ్లపాలైందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యమంతా తడిసి ముద్దవడం రైతులకు కన్నీరు పెట్టించింది. పలు ప్రాంతాల్లో మామిడి, నిమ్మకాయలు నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన పంటకు పరిహారం ఇవ్వాలని కోరుతున్నారు.

సన్మార్గంలో జీవించాలి

మంత్రి కొండా సురేఖ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధిః వర్ధమాన మహావీరుని బోధనలను ఆకళింపు చేసుకొని సన్మార్గంలో జీవిస్తూ, జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక ప్రపంచంలో జైనం విప్లవాన్ని సృష్టించిందని ఆమె పేర్కొన్నారు. ఆదివారం వర్ధమాన మహావీరుని జయంతి సందర్భంగా మంత్రి సురేఖ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జైనులకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజాన్ని సన్మార్గంలో నడిపించిన వర్ధమానుడు ఆ తర్వాత మహావీరుడయ్యాడని మంత్రి కీర్తించారు.

23న హనుమాన్ శోభాయాత్ర

- ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ

అక్షర దర్బార్, హనుమకొండ : హనుమాన్ శోభా యాత్ర ను ప్రశాంతంగా నిర్వహించుకుందామని సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ పిలుపునిచ్చారు. ఈనెల 23 ట్రైసిటీలో నిర్వహించే హనుమాన్ శోభాయాత్ర ను ప్రశాంతంగా నిర్వహించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులు, వివిధ ప్రభుత్వ విభాగాలతో పాటు శోభాయాత్ర నిర్వాహకులతో డీసీపీ సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. శోభా యాత్ర సజావుగా కొనసాగేందుకు బందోబస్తు ఏర్పాట్లు, శోభయాత్ర కొనసాగే మార్గాలపై డీసీపీ చర్చించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ వరంగల్ మహానగరంలో అన్ని మతలవారు సోదరభావంతో పండుగలను జరుపుకుంటారని, వరంగల్ ప్రజలు ఇతర ప్రాంతాల వారికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ శుభం నాగ్, ఏసీపీలు దేవేందర్ రెడ్డి, నందిరాం నాయక్, సత్యనారాయణ, బల్దియా అడిషనల్ కమిషనర్ అన్వర్ రషీద్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్లు, రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ అధికారులు, విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.